ప్రజాశక్తి
మంగళవారం 18 మార్చి 2025
5
విజయనగరం



9 మంది పంచాయతీ కార్యదర్శులకు ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో 69 మంది పంచాయతీ కార్యదర్శులకు ఉద్యోగోన్నతి లభించింది. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా, జిల్లా పంచాయతీ అధికారి టి.వెంకటేశ్వరరావు కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం వీరికి కౌన్సిలింగ్ నిర్వహించి, ఉద్యోగోన్నతులు కల్పించారు. వారి అభీష్టానికి అనుగుణంగా పోస్టింగ్‌లు కేటాయించారు. గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులు 57 మందికి గ్రేడ్-4 కార్యదర్శులుగా ఉద్యోగోన్నతి కల్పించారు. అలాగే గ్రేడ్-4 కార్యదర్శులు 12 మందికి గ్రేడ్-3 కార్యదర్శులుగా ఉద్యోగోన్నతి లభించింది. అయితే వీరిలో నలుగురు గ్రేడ్-4 కార్యదర్శులు వివిధ కారణాలతో ఉద్యోగోన్నతిని తిరస్కరించారు. మిగిలిన 8 మంది కొత్త స్థానాల్లో చేరారు. ఉద్యోగోన్నతి లభించిన పంచాయతీ కార్యదర్శులకు జిల్లా ఇన్‌ఛార్జి జెసి ఎస్.శ్రీనివాసమూర్తి పత్రాలను పంపిణీ చేసి అభినందించారు. కార్యక్రమంలో పంచాయతీ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దద్దరిల్లిన కలెక్టరేట్

విజయనగరం
కలెక్టరేట్ ధర్నాలతో సోమవారం దద్దరిల్లింది. రైతులందరికీ సంక్షేమ పథకాలు ఇవ్వాలని, అందరికీ భూధార్ వర్తింపజేయాలని ఓ వైపు కర్షకులు గర్జిస్తే.. కానిస్టేబుల్ మెయిన్ ఎగ్జామ్ నిర్వహించాలని నిరుద్యోగులు కదంతొక్కారు. కనీస వేతనాలు అమలు చేయాలంటూ వైద్య ఆరోగ్య శాఖలోని ఆరోగ్యమిత్రలు నినదిస్తే.. బకాయి వేతనాలు చెల్లించాలని ప్రభుత్వ విద్యాసంస్థల్లోని శానిటేషన్ వర్కర్లు సైతం పోరుబాట పట్టారు. వారి నినాదాలతో కలెక్టరేట్ ప్రాంతం మార్మోగింది.

\- ప్రజాశక్తి, విజయనగరం టౌన్

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న రైతు, గిరిజన సంఘం నాయకులు, కౌలురైతులు, దళిత, గిరిజనులు

రైతులందరికీ సంక్షేమ పథకాలు ఇవ్వాలి

కౌలు రైతులకు, దళిత, గిరిజనులు, ఇనాం రైతులకు భూధార్‌ను వర్తింప చేస్తూ, జీడి 80 కేజీల బస్తాకు రూ.16వేలు మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఏపి కౌలు రైతుల సంఘం,గిరిజన సంఘాలు ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ధర్నానుద్దేశించి కౌలు రైతుల సంఘం నాయకులు గొంప కృష్ణమూర్తి, రాకోటి రాములు, బి.రమణ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న భూధార్ వలన కౌలురైతులు దళిత, గిరిజనులు ఏళ్ల తరబడి సాగుచేస్తున్న డిపట్టాలు, డికెటి పట్టాలు పోడు భూమి పట్టాలు (ఆర్‌ఓఎఫ్‌ఆర్) (పార్మర్ రిజిస్ట్రేషన్ కంప్యూటర్ ఆన్లైన్ చేయక పోవడంతో రైతు సంక్షేమ పథకాలు పొందడానికి అవకాశం లేకుండా పోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతు భరోసా, పిఎం కిసాన్, పంటల మద్దతు ధర రావన్నారు. రాయితీపై విత్తనాలు, పురుగుమందులు, ఎరువులు, యంత్రాలు ఉపాధి హామీ ద్వారా భూమి అభివృద్ధి పనులు మంజూరయ్యే పరిస్థితిలేదన్నారు. కావున రైతులందరికీ భూ ధార్ వర్తింపజేయాలని కోరారు. జీడిపిక్కలు 80 కేజీల బస్తా 16000/- మద్దతు ధర ప్రకటించి రైతు సేవా కేంద్రాలు, గిరిజన కార్పొరేషన్, ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

కానిస్టేబుల్ అభ్యర్థుల నిరసన

కానిస్టేబుల్ అభ్యర్థులకు మెయిన్ ఎగ్జామ్ నిర్వహించాలని, పోలీస్ శాఖలో ఖాళీగా ఉన్న 20 వేల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కోట జంక్షన్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అభ్యర్థులంతా ప్లకార్డులు పట్టుకొని ఆర్‌టిసి కాంప్లెక్స్, ఆర్‌అండ్‌బి జంక్షన్ మీదుగా ర్యాలీ చేశారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ సిహెచ్ హరీష్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయాంలో 6100 పోలీస్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి 2022 నవంబర్ 28న నోటిఫికేషన్ విడుదల చేసిందని, 2023 జనవరి 22న ప్రిలిమ్స్ పరీక్షకు 4, 59,182. మంది హాజరయ్యారని తెలిపారు. 95,208 మంది అర్హత సాధించారని, ఈలోగా ఎమ్మెల్సీ ఎన్నికలు, కోర్టు కేసులు వల్ల 2024 డిసెంబర్ 22 నుండి జనవరి 16 వరకు ఈవెంట్స్ జరిగాయని అన్నారు. మెయిన్ ఎగ్జామ్ గురించి ఇంతవరకు ప్రభుత్వం నుండి ఎటువంటి స్పందన లేకపోవడంతో అభ్యర్థులు ఎదురు చూస్తున్నారని అన్నారు. ప్రభుత్వ వెంటనే మెయిన్ ఎగ్జామ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పోలీస్ శాఖలో ఖాళీగా ఉన్న 20వేల పోలీస్ కానిస్టేబుల్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. అనంతరం కలెక్టర్‌కు వినతి అందజేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో కానిస్టేబుల్ అభ్యర్థులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కానిస్టేబుల్ అభ్యర్థులు, డివైఎఫ్ఐ నాయకులు

కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న ఆరోగ్యమిత్రలు

కనీస వేతనాల కోసం ఆరోగ్యమిత్రల ఆందోళన

వైద్య ఆరోగ్య శాఖ లో పని చేస్తున్న ఆరోగ్య మిత్రులకు కనీస వేతనాలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని వైద్య ఆరోగ్య మిత్ర కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జె.ప్రదీప్, ఎ.బంగారునాయుడు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 17ఏళ్లగా ఎన్.టి.ఆర్.వైద్య సేవా పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ లెవల్ సిబ్బందికి మినిమమ్ స్కేల్, కేడర్, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఫీల్డ్ సిబ్బంది అందరినీ ప్రభుత్వ పరిధిలో ప్రభుత్వ కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తిస్తూ, వైద్య మిత్రలకు కనీత వేతనం ఇవ్వాలని కోరారు. చనిపోయిన వారి కుటుంబాలకు రూ.15లక్షలు ఎక్స్‌గ్రేషియో, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ10లక్షలు, ప్రభుత్వ ఉద్యోగాలలో వెయిటేజ్ కల్పించాలని కోరారు. డాక్టర్ ఎన్.టి.ఆర్. సిబ్బందికి అంతర్గత ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ఆర్.మహేష్, ఆరోగ్య మిత్రులు పాల్గొన్నారు.

ఆయాలకు బకాయి వేతనాలు చెల్లించాలి

ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో పని చేస్తున్న ఆయాలు బకాయి వేతనాలు చెల్లించాలని ప్రభుత్వ విద్యా సంస్థల శానిటేషన్ వర్కర్ల యూనియన్ నాయకులు బి.సుధారాణి డిమాండ్ చేశారు. సోమవారం ఆయలతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. బకాయి ఉన్న మూడు నెలల వేతనాలు చెల్లించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ప్రతి 50 మంది విద్యార్థులకు ఒక ఆయాను నియమించాలన్నారు. ఫుల్ టైం వర్కర్లుగా గుర్తించి రూ.12వేలు వేతనం ఇవ్వాలని, పిఎఫ్, ఇఎస్ ఐ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం గ్రీవెన్సులో కలెక్టర్‌కు వినతి అందజేశారు. కార్యక్రమంలో శారద, కృష్ణవేణి, సన్యాసమ్మ తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న శానిటేషన్ వర్కర్లు

అందని ఉపాధి వేతనాలు

- విజయనగరం, మన్యం జిల్లాల్లో రూ.64 కోట్ల బకాయి
- జనవరి 15 తరువాత నిలిచిన లావాదేవీలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

జిల్లాలో ఉపాధి కూలీలకు వేతనాలు నిలిచిపోయాయి. సుమారు 51రోజులకు సంబంధించిన వేతనాలు పెండింగ్‌లో ఉండడం వల్ల కూలీలంతా ఆర్థికంగా అవస్థలు పడుతున్నారు. మునుపెన్నడూ ఇన్ని రోజులపాటు వేతనాలు పెండింగ్‌లో ఉంచలేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ జాతీయ ఉపాధి హామీ చట్టంలో భాగంగా ఏడాదికి 100 రోజులు ఉపాధి పనులు కల్పించాల్సివున్న విషయం విధితమే. వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర కల్పించక పోవడం, రైతులకు సబ్సిడీలు తగ్గిపోవడం, ఎరువులు, పురుగుల మందుల ధరలు, ట్రాక్టర్ అద్దెలు తదితరాలు పెట్టుబడి పెరిగిపోవడం రైతులకు ఉపాధి హామీ పనులే గత్యంతరంగా మారాయి. ముఖ్యంగా తగిన సాగునీటి వనరులు లేకపోవడం వల్ల ఖరీఫ్ పంట ఒక్కటే జీవనాధారం. మిగిలిన సమయంలో ఉపాధి పనులే జీవనాధారం. ప్రధానంగా వ్యవసాయ కార్మిక కుటుంబాలవారికి ఉపాధి పనులు లేకపోతే కొన్ని కుటుంబాల వారికి జీవనోపాధి లేనట్టే లెక్క. ఈనేపథ్యంలోనే ఏడాదికి 200రోజుల పాటు పనిదినాలు కల్పించాలని, రోజుకు రూ.600 వరకు రోజువారి వేతనం అందేలా చర్యలు తీసుకోవాలని కూలీలు, వారి తరపున వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ చేస్తోంది. ఇటువంటి పరిస్థితుల్లో చట్ట ప్రకారం కూలీలు పని అడిగిన వెంటనే పని కల్పించడం, వారం లేదా పక్షం రోజుల్లో వేతనాలు చెల్లించడం వంటి నిబంధనలు పక్కాగా అమలు చేయాల్సిన ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది. కేంద్ర ప్రభుత్వం ఏటా ఉపాధి పనులకు బడ్జెట్ కేటాయింపులు తగ్గిస్తుండగా, కేటాయించిన అరకొర నిధులను దారి మళ్లిస్తోంది. దీంతో, కూలీలకు సకాలంలో వేతనాలు చెల్లించడం లేదు. ఈ ఏడాది జనవరి 15వ తేదీ నుంచి చేపట్టిన పనులకు వేతనాలు చెల్లించలేదు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రూ.800కోట్ల మేర వేతన బకాయి ఉన్నట్టుగా సమాచారం. ఇందులో విజయనగరం జిల్లాలో సుమారు 25లక్షల పనిదినాలకు సంబంధించి రూ.52కోట్లు బకాయి ఉంది. పార్వతీపురం మన్యంలో రూ.12కోట్ల మేర ఉంది. ఇతర పనులు కూడా ఏమీ దొరక్కపోవడం వల్ల ఆర్థికంగా అవస్థలు పడుతున్నామని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బకాయిలు చెల్లించాలి

ఈ ఏడాది జనవరి 14 నుంచి ఉపాధి పనులకు వెళ్తున్నాం. రెండు నెలలకు పైగా వేతనాలు రాక పోవడంతో ఇబ్బ ందులు పడు తున్నాం. ఎండ వేడిని సైతం తట్టుకొని రెండు పూటలా పనులు చేస్తున్నా కూలి అందకపోవడంతో అవస్థలు పడుతున్నాం. నాకు రూ.4వేలు వరకు రావాల్సి ఉంది.

\- కడియాల చిన్నయ్య, ఆరిక తోట, రామభద్రపురం మండలం

2 వారాలుగా పనిచేస్తున్నా..

రెండు వారాల నుంచి ఉపాధి పనులు చేస్తున్నాను. నేటివరకు డబ్బులు జమకాలేదు. కూలి అందకపోవడంతో కుటుంబ పోషణ కష్టంగా ఉంది. అధి కారులు స్పందించి కూలి డబ్బులు చెల్లించాలి.

\- సునాధి సుభద్ర, పెదబుడ్డిడి, జియ్యమ్మ వలస మండలం

పకడ్బందీగా పదో తరగతి పరీక్షలు

- గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకున్న విద్యార్థులు
- క్షుణ్ణంగా తనిఖీ చేసి కేంద్రాల్లోకి పంపించిన సిబ్బంది
- పరీక్ష కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థుల సందడి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. సోమవారం తొలి పరీక్ష కావడంతో విద్యార్థులను తమ తల్లిదండ్రులు తీసుకొని పరీక్షా కేంద్రాలకు వచ్చారు. పరీక్ష 9.30గంటలకు ప్రారంభం కాగా ఉదయం 8.30 గంటలకే విద్యార్థులు కేంద్రాలకు చేరుకున్నారు. 9 గంటలకు విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి పరీక్ష కేంద్రాల్లోకి సిబ్బంది పంపించారు. ఎటువంటి ఎలాక్ట్రానికి పరికరాలనూ లోపలికి అనుమతించలేదు. విజయగనరం కంటోన్మెంట్ హైస్కూల్ వద్ద రహదారిపై విద్యార్థులు, తల్లి తండ్రులు ఎక్కువుఃగా ఉండటంతో కొద్ది సేపు ట్రాఫిక్ కు ఇబ్బంది కలిగింది. వెంటనే ట్రాఫిక్ పోలీసులు చేరుకొని రాకపోకలకు అంతరాయం లేకుండా చేశారు. జిల్లా వ్యాప్తంగా టెన్త్ పరీక్షకు 22,908 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 22,800 మంది హాజరయ్యారు. 108 మంది విద్యార్థులు హాజరు కాలేదు.



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అంబేద్కర్

పరీక్షా కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ అంబేద్కర్

పకడ్బంధీగా పదోతరగతి పరీక్షలను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. సోమవారం పలు పరీక్షా కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ముందుగా కంటోన్మెంటులోని సెయింట్ ఆన్స్ బాలికోన్నత పాఠశాలను, మున్సిపల్ ఉన్నత పాఠశాలను సందర్శించి తరగతి గదులను పరిశీలించారు. తరగతి గదుల్లో తక్షణమే తగినంత లైటింగ్‌ను ఏర్పాటు చేయాలని సెయింట్ ఆన్స్ పాఠశాలలో ఆదేశించారు. విద్యార్థులకు ఏర్పాటు చేసిన తాగునీరు, ఇతర వసతులను పరిశీలించారు. వైద్యశిబిరాన్ని సందర్శించారు. అనారోగ్యంతో ఉన్న విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి, అవసరమైన మందులను అందజేయాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం విజయనగరం మండలంలోని జొన్నవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. కలెక్టర్ వెంట డిఇఒ మాణిక్యంనాయుడు, విజయనగరం తాహసీల్దార్ కూర్మనాధరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బొబ్బిలిలో స్తంభించిన ట్రాఫిక్

బొబ్బిలి : బొబ్బిలి పట్టణంలో ప్రధాన కూడళ్లలో సోమవారం ట్రాఫిక్ స్తంభించింది. పదో తరగతి పరీక్షలు ముగిసిన తర్వాత ఒకేసారి విద్యార్థులు రోడ్లపైకి రావడంతో ఎక్కడికక్కడ ట్రాఫిక్ నిలిచిపోయింది. శ్వేతచలపతి, తాండ్ర పాపారాయ, వాసవీ థియేటర్ జంక్షన్లలో ట్రాఫిక్ స్తంభించడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

పాఠశాలకు నిప్పు

దుండగుల దుశ్చర్య • సుమారు రూ. 3 లక్షలు నష్టం

ప్రజాశక్తి - చీపురుపల్లి

గుర్తుతెలియని దుండగులు చీపురుపల్లి ఫైర్‌స్టేషన్ సమీపంలో గల రామాంజనేయ కాలనీ ఉన్నత పాఠశాలకు నిప్పు అంటించడంతో పాఠశాల భవనంలోని ఆఫీసు గది పూర్తిగా కాలి బూడిదయ్యింది. దీంతో గదిలో ఉన్న సామాన్లు దగ్ధమయ్యాయి. ఈ సంఘటనలో మూడు లక్షల రూపాయల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు విద్యాశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. చీపురుపల్లి పట్టణ పరిధిలో ఫైర్ స్టేషన్, ఇంటిగ్రేటెడ్ వసతి గృహానికి సమీపంలో ఉన్న రామాంజనేయ కాలనీ ఉన్నత పాఠశాల భవనంలో పాఠశాల గది తలుపులను బద్దలు కొట్టి గుర్తుతెలియని దుండగులు పాఠశాల భవనంలో నిప్పు పెట్టారు. ఈ ప్రమాదంలో పాఠశాలకు సంబంధించిన పలు రికార్డులతో పాటు లైబ్రరీ పుస్తకాలు బీరువాలు, ఫ్యాన్లు అగ్నికి ఆహుతయ్యాయి. మధ్యాహ్న భోజన పథకం కోసం నిల్వ చేసిన నిత్యవసర వస్తువులు కూడా అగ్నికి ఆహుతి అయినట్లు అధికారులు చెబుతున్నారు. మైక్రో స్కోప్, లైబ్రరీ పుస్తకాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. కొంతమంది మద్యం సేవించి స్కూలు తలుపులు బద్దలు కొట్టి అగ్ని ప్రమాదానానికి పాల్పడి ఉంటారని అంచనా వేస్తున్నారు. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక శాఖ అధికారులు, డిఎస్‌పి రాఘవులు, సిఐ జి.శంకర్రావు, గరివిడి ఎస్ఐ లోకేష్‌లు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దుండగుల కోసం గాలిస్తున్నారు. డాగ్ స్క్వాడ్‌ని కూడా రంగంలోకి దింపి దుండగుల కోసం పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ మేరకు గరివిడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఈ నెల 16 సాయంత్రం 6గంటల సమయంలో పాఠశాల నుండి పొగలు రావడం గమనించిన ఇంటిగ్రేటెడ్ వసతి గృహం విద్యార్థులు పాఠశాల ఉపాధ్యాయులకు సమాచారం అందించడంతో హుటాహుటిన ఉపాధ్యాయులు పాఠశాలకు చేరుకొని పోలీసులకు సమాచారం అందించారు.

కాలిపోయిన రికార్డులు

గ్రీవెన్స్ వినతులకు తెలుగులోనే సమాధానం

కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశం

ప్రజాశక్తి-విజయనగరం కోట

ప్రజా వినతుల పరిష్కార వేదికలో వివిధ వర్గాలు ఇచ్చే వినతులను పరిష్కరించిన అనంతరం తెలుగులో వారికి అర్థమయ్యే రీతిలో సమాచారం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. వచ్చిన ప్రతి వినతిని పరిష్కరించిన తర్వాత ఆయా వినతులు అందించిన వారితో మాట్లాడి పరిష్కారం సాధ్యమవుతుందో లేదో తెలపాలన్నారు. ఆ సమాధానంతో వారు సంతృప్తి చెందనట్లయితే ఆయా వినతులను మళ్లీ తెరచి పునఃపరిష్కరించే ప్రయత్నం చేయాలని చెప్పారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావినతుల పరిష్కార వేదికలో కలెక్టర్‌తో పాటు ఇన్‌ఛార్జి జెసి ఎస్.శ్రీనివాసమూర్తి, డిప్యూటీ కలెక్టర్‌లు ప్రమీలాగాంధీ, మురళి, నూకరాజు తదితరులు వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా వినతుల పరిష్కారంపై కలెక్టర్ జిల్లా అధికారులతో సమీక్షించారు. ప్రతి జిల్లా అధికారి వారంలో ఒకరోజు తమ మండల, డివిజన్ స్థాయి అధికారులతో తమ శాఖకు సంబంధించిన వినతుల పరిష్కారంపై సమీక్షించాలన్నారు.

టెన్త్ విద్యార్థులకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేయాలి

జిల్లాలో పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మండలాల ప్రత్యేక అధికారులు, తహాశీల్దార్‌లు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో వసతులపై ఆర్‌డిఒ, తహాశీల్దార్, ప్రత్యేక అధికారులు తనిఖీలు చేయాలన్నారు. ఆర్టీసీ ద్వారా పరీక్ష కేంద్రాలకు సులువుగా చేరుకునేందుకు వీలుగా అవసరమైన బస్సులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ అంబేద్కర్

కలెక్టర్ల సదస్సుకు శాఖల వారీ నివేదికలు ఇవ్వాలి

ముఖ్యమంత్రి నేతృత్వంలో ఈనెల 25, 26 తేదీల్లో కలెక్టర్‌ల సదస్సు జరుగుతుందని, ఈ సమావేశానికి అవసరమైన నివేదికలను అన్ని ప్రభుత్వ శాఖలు అందించాలని చెప్పారు.

గ్రీవెన్స్‌కు 213 వినతులు

కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావినతుల పరిష్కార వేదికకు 213 వినతులు అందాయి. అధికంగా రెవిన్యూ శాఖకు 148 వచ్చాయి.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనం నిర్మించాలి

విజయనగరంలో 2019లో ఏర్పాటైన ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఇప్పటి వరకు సొంత భవనం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే భవనం నిర్మించాలని ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు కె.సూరిబాబు, కె.రాజు కోరారు. సోమవారం కలెక్టర్‌కు వినతి అందజేశారు. తరగతి గదులు లేక విద్యార్థులకు ఒక పూట మాత్రమే తరగతులు నిర్వహించడంతో, కోర్సులు పూర్తి అవ్వక అరకొర చదువులు సాగుతున్నాయని అన్నారు.

అప్రోచ్ రోడ్డు వెంబడి సర్వీసు రోడ్డు మంజూరు చేయాలి

భోగాపురం మండలంలో ఎయిర్ పోర్టు అప్రోచ్ రోడ్డు కోసం సేకరించిన భూమికి ఇరువైపులా నిర్మాణ సంస్థ ఫెన్సింగ్ వేయడంతో సమీప గ్రామాల్లో వ్యవసాయ భూములకు వెళ్లేందుకు మార్గంలేక ఇబ్బందులు పడుతున్నట్టు ఎయిర్ పోర్టు నిర్వాసిత గ్రామాలైన గూడెపువలస, సవరవిల్లి, దల్లిపేట, బైరెడ్డిపాలెం, ఎ.రావివలస తదితర ఐదు గ్రామాలకు చెందిన ప్రజలు ఉప్పాడ శివారెడ్డి ఆధ్వర్యాన కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు విన్నవించారు. అప్రోచ్ రోడ్డుకోసం సేకరించిన భూమిలో దాని వెంబడి సర్వీసు రోడ్డ నిర్మిస్తే తమకు ఇబ్బ ందులు తప్పుతాయని వారు తెలిపారు. దీనిపై జిల్లా కలెక్టర్ ఆర్‌డిఒ కీర్తితో ఆన్ లైన్ వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడి ఈ గ్రామాలను సందర్శించి అక్కడి ప్రజల సమస్యలపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.



గ్రీవెన్స్‌లో వినతి అందజేసేందుకు వచ్చిన ఎయిర్‌పోర్టు నిర్వాసిత గ్రామస్తులు

గురుకుల ప్రవేశ పరీక్ష వాయిదా

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఎంజెపి బాలికల గురుకుల పాఠశాల, కళాశాల ప్రవేశ పరీక్ష ఈ నెల 4వ తేదీన వాయిదా పడినట్లు ఎంజెపి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ కెబిబి రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంజెపి బిసి గురుకుల బాలికల పాఠశాల, కళాశాల సిఐటి - 2025 5వ తరగతి, ఇంటర్మీడియట్, బ్యాక్‌లాగ్ ఖాళీల ప్రవేశాలకు (6వ, 7వ, 8వ 9వ తరగతులకు) దరఖాస్తు గడువు ఈనెల 25వరకు పొడిగించారని తెలిపారు.ఆసక్తిగల అభ్యర్థులు అవకాశాన్ని ఉపయోగించుకోవాలని తెలిపారు.

ఆప్టోమెట్రిస్ట్‌లకు ఉపాధి అవకాశాలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఆప్టోమెట్రీ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు వివిధ రంగాలలో ఉపాధి అవకాశాల గురించి హైదరాబాద్‌లోని హైసైట్ ఐ హాస్పిటల్‌లో ఆప్టోమెట్రీ విభాగాధిపతి, పూర్వ విద్యార్థి ఎ.అరవింద్ రెడ్డి వివరించారు. సోమవారం ఆయన తన ప్రసంగంలో ఆప్టోమెట్రీ వృత్తి ప్రాముఖ్యత, కెరీర్‌లో ఎలా రాణించగలరు తదితర అంశాల గురించి వివరించారు. ఆరోగ్య సంరక్షణ నిపుణులకు డ్రెస్సింగ్ స్టైల్ ప్రాముఖ్యత, కమ్యూనికేషన్, ప్రెజెంటేషన్ నైపుణ్యాలు విద్యార్థుల భవిష్యత్తును ఎలా నిర్ణయిస్తాయో వివరించారు. ఈ కార్యక్రమంలో ఆప్టోమెట్రీ విభాగం అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్ కాశీవిశ్వేశ్వరుడు మృతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మాజీ కౌన్సిలర్ మేకా కాశీ విశ్వేశ్వరుడు సోమవారం మృతి చెందారు. ప్రదీప్‌నగర్‌లో నివాసముంటున్న ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. పరిస్థితి విషమించి మృతి చెందారు. ఆయన మృతికి పలువురు నాయకులు సంతాపం తెలిపారు.

పట్టుపరిశ్రమ షెడ్లు పరిశీలన

ప్రజాశక్తి- మెరకముడిదాం

మండలంలోని ఉత్తరావిల్లి పంచాయతీ పరిధిలో రైతు రాడ సూర్యనారాయణకు మంజూరైన పట్టు పరిశ్రమ షెడ్, మల్బరీ మొక్కలను ఎంపిడిఒ జి.భాస్కరరావు సోమవారం పరిశీలించారు. ఉపాధి హామీ పథకం ద్వారా సామాజిక పనులతో పాటు వ్యవసాయ సంబంధ, వ్యక్తి గత పనులను గుర్తించి వాటి నిర్వహణపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఎపిఒ నరేంద్రకుమార్, టిఎ రమణ, అప్పలనాయుడు, ఫీల్డ్ అసిస్టెంట్ సౌజన్య పాల్గొన్నారు.

28న తపాలా అదాలత్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం పోస్టల్ డివిజన్ పరిధిలోని తపాలా వినియోగదారుల వ్యక్తిగత ఫిర్యాదులు, సమస్యలు పరిష్కరించేందుకు ఈనెల 28న ఉదయం 10గంటలకు సూపరింటెండెంట్ కార్యాలయంలో తపాలా అదాలత్, పెన్షన్ అదాలత్ జరుగుతుందని సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్ తెలిపారు. సర్వీసులకు సంబంధించిన ప్రత్యేక వ్యక్తిగత ఫిర్యాదులు మాత్రమే ఈ అదాలత్‌లో చర్చిస్తామని తెలపారు. పోస్టల్ వినియోగదారులు తమ సమస్యలు, ఫిర్యాదులను ఈనెల 27లోగా విజయనగరం తపాలాశాఖ కార్యాలయానికి పంపాలని తెలిపారు.

గ్రంథాలయానికి ఫ్యాన్లు వితరణ

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పట్టణంలోని శాఖా గ్రంథాలయానికి పంజాబ్ నేషనల్ బ్యాంకు శృంగవరపుకోట బ్రాంచి ప్రతినిధులు ఎనిమిది వాల్ ఫ్యాన్లను సోమవారం అందజేశారు. దీంతో బ్రాంచి మేనేజర్, సిబ్బందికి శాఖా గ్రంథాలయాధికారి శ్రీధర్, పాఠకులు కృతజ్ఞతలు తెలిపారు.

ఇళ్ల లబ్ధిదారులకు అదనపు సాయం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

గృహ నిర్మాణ లబ్ధిదారులకు నాలుగు విడతల్లో అదనపు సాయాన్ని ప్రభుత్వం అందజేస్తుందని ఎంపిడిఒ సతీష్ తెలిపారు. ఎస్‌సి, బిసిలకు రూ.50 వేలు, ఎస్‌టిలకు రూ.75 వేలు చొప్పున ప్రభుత్వం అదనంగా అందిస్తున్నట్లు తెలిపారు.

ఐదు బోర్లు మంజూరు

ప్రజాశక్తి -వేపాడ

జిల్లా పరిషత్తు నిధుల నుంచి మండలానికి ఐదు బోర్లు మంజూరయ్యాయి. ఒక్కో బోరుకు రూ.లక్ష చొప్పున రూ.ఐదు లక్షలతో జెడ్‌పిటిసి సభ్యులు ఎస్.అప్పలనాయుడు బోర్లను మంజూరు చేయించారు. చామలాపల్లి, సోంపురం, ఓబులయ్యవలస, సింగరాయి, నల్లబిల్లి గ్రామాలకు బోర్లు మంజూరయ్యాయి. అందులో భాగంగా సోంపురం గ్రామంలో సోమవారం బోరు పనులు ప్రారంభించారు.

ఎపిఒకు ఘన సన్మానం

ప్రజాశక్తి - భోగాపురం

బదిలీపై వెళ్లిన ఉపాధి హామీ పథకం ఎపిఒ ఎం ఆదిబాబును మండల పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపిపి ఉప్పాడ అనూష రెడ్డి, సలహాదారు సూర్యనారాయణరెడ్డి తదితరులు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో ఆయన చేసిన సేవలు గురించి కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ గాయత్రి, ఎపిఒ భాగ్యలక్ష్మి, ఎ ఐ కామేశ్వరరావు, ఎంఇఒ- 2 చంద్రమౌళి, ఈసీ శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్థలాలకు పొజిషన్ ఇప్పించాలని వినతి

ప్రజాశక్తి -పూసపాటిరేగ

మండల కేంద్రంలోని నివాసముంటున్న ముస్లిం సోదరుల సొంత స్థలంలో పొజిషన్ ధృవీకరణ ఇప్పించాలని సోమవారం పూసపాటిరేగ మాజీ సర్పంచ్ పిన్నింటి సన్యాసినాయుడు ఆధ్వర్యంలో టిడిపి జిల్లా పార్టీ అధ్యక్షులు కిమిడి నాగార్జున, ఎపిపి రాజు, ఆర్‌టి ప్రసాదరావు ముస్లిం సోదరులతో కలిసి కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ అందజేశారు. ముందుగా ముస్లిం సమస్యను కిమిడి నాగార్జునకు సన్యాసి నాయుడు వివరించారు. చాలా కాలంగా పూసపాటిరేగలో ఉన్నారని, వీరికి న్యాయం చేయాలని కోరారు. దీంతో ఆయన స్పందించి వీరికి ఎలాగైనా ధృవీకరణ ఇచ్చేలా అధికారులతో మాట్లాడుతానని చెప్పారు. వారితో పాటు కప్పల రామారావు, ముస్లిం సోదరులు ఉన్నారు.

మహిళలకు శక్తి యాప్

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మహిళల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం శక్తియాప్ ప్రవేశపెట్టిందని టిడిపి మహిళా పార్లమెంట్ అధ్యక్షులు సువ్వాడ వనజాక్షి అన్నారు. సోమవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ గత ప్రభుత్వం దిక్కులేని దిశ యాప్‌లా కాదని శక్తి యాప్ సమర్థవంతంగా పనిచేస్తుందని అన్నారు. మహిళలకు శక్తి యాప్ ఆపద్బాంధవి లాంటిదన్నారు. వైసిపి పాలనలో మహిళలపై అనేక దాడులు...అత్యాచారాలు జరిగాయని, ప్రస్తుతం మహిళలకు అత్యవసర సమయంలో సహాయం అందించేందుకు శక్తియాప్ కీలకంగా పనిచేస్తుందని తెలిపారు. మహిళలు ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు.

క్షయవ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి - నెల్లిమర్ల

స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో క్షయ వ్యాధిపై సోమవారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రజారోగ్య వైద్యులు డాక్టర్ చక్క వేణు గోపాల్ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ కె. ఉషారాణి ముఖ్య అతిథులుగా హాజరై, క్షయవ్యాధి లక్షణాలు, వ్యాప్తి, నిర్ధారణ, చికిత్స గురించి వివరించారు. దీర్ఘకాలిక దగ్గు,రాత్రి వేధించే జ్వరం బరువు తగ్గడం, అలసట, ఛాతిలో నొప్పి వంటి అంశాలపై అవగాహన కల్పించి పలు సూచనలు చేశారు. క్షయ పూర్తిగా నయం చేయదగిన వ్యాధని ప్రభుత్వ వైద్యశాలలో ఉచితంగా వైద్య పరీక్షలు చేస్తారని తెలిపారు. ప్రజలు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించి, దగ్గు వంటి లక్షణాలు ఉంటే తక్షణమే వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త సి.హెచ్. మన్మథరావు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియను బలోపేతం చేద్దాం : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఎన్నికల ప్రక్రియను మరింత బలోపేతం చేయడానికి రాజకీయ పార్టీలు తమవంతు సహకారాన్ని అందించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ కోరారు. దీనికోసం బూత్ స్థాయిలో బిఎల్ఎలను నియమించాలని ఆయన పార్టీలకు సూచించారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో తమ ఛాంబర్‌లో సోమవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలకు సంసిద్ధత అన్నది ప్రస్తుతం నిరంతర ప్రక్రియగా మారిందని చెప్పారు. దీనిలో భాగంగానే మార్పులు, చేర్పుల కోసం దరఖాస్తులను ప్రతిరోజూ స్వీకరిస్తున్నట్లు చెప్పారు. ఇక నుంచి ప్రతి నెలా రాజకీయ పార్టీలతో సమావేశాన్ని నిర్వహిస్తామని చెప్పారు. ఎన్నికల ప్రక్రియలో ఏమైనా లోటుపాట్లు గుర్తిస్తే, వాటిని ఎప్పటికప్పుడు సరిచేయడానికి అవకాశం కలుగుతుందని తెలిపారు. తప్పులు లేని కచ్చితమైన ఓటర్ల జాబితాలను రూపొందించడం, పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలను కల్పించడం, పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించడం చాలా అవసరమన్నారు. దీనికోసం రాజకీయ పార్టీలు పూర్తిగా సహకరించాలని కోరారు. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను గుర్తించేందుకు ప్రతీ పోలింగ్ కేంద్రానికి పార్టీలు తమ ప్రతినిధులుగా బిఎల్ఎలు నియమించుకోవాలని సూచించారు. ఇన్‌ఛార్జి జెసి ఎస్.శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ సమావేశ లక్ష్యాలను, పార్టీలు నిర్వర్తించాల్సిన విధులను వివరించారు. ఈ సమావేశంలో టిడిపి నుంచి ఐవిపి రాజు, వైసిపి నుంచి వి.నర్సింహమూర్తి, కాంగ్రెస్ నుంచి ఎస్.సతీష్‌కుమార్, బిజెపి నుంచి ఎం.అప్పలసూరి, జనసేన నుంచి శ్రీనివాస్, బిఎస్‌పి నుంచి కె.సోములు తదితర ప్రతినిధులు, ఎలక్షన్ సూపరింటిండెంట్ భాస్కర్రావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్

ఓటర్ల నమోదు నిరంతర ప్రక్రియ

బొబ్బిలి : ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని ఆర్‌డిఒ రామ్మోహనరావు తెలిపారు. సోమవారం ఆర్‌డిఒ అధ్యక్షతన నియోజకవర్గంలో ఉన్న అన్ని రాజకీయ పక్షాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో ఏమైనా సవరణలు అవసరమైతే సంబంధిత బూత్ స్థాయి అధికారులను కలిసి ఫారం- 6, 7, 8 క్లెయిమ్స్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వారి అర్హతను బట్టి, విచారణ నిర్వహించి అర్హులైతే, జాబితాలో మార్పులు, చేర్పులు చేస్తామని చెప్పారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి బూత్ స్థాయి ఏజెంట్లను నియమించుకోవాలని సూచించారు. నియోజకవర్గ స్థాయిలో ప్రతి నెలా మొదటి వారంలో రాజకీయ పక్షాలతో సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో బొబ్బిలి ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ బలివాడ గౌరీశంకరరావు పాల్గొన్నారు.

ఆదరణ పథకంపై సమావేశం

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న ఆదరణ పథకంపై బిసి కార్పొరేషన్ ఇడి పెంటోజీరావు సోమవారం బిసి సంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇడి మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, ఆదరణ పథకం ముఖ్య ఉద్దేశాలను వివరించారు. వృత్తులను కాపాడుకొని జీవితాలను బాగు చేసుకునేందుకు ఆదరణ పథకం ఉపయోగపడుతుందని తెలిపారు. జిల్లాలో వివిధ కుల సంఘాలు వృత్తులకు కావలసిన పరికరాలను ప్రభుత్వం అందజేసుతందని అన్నారు. కార్యక్రమంలో బిసి సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ చోడి ఆదినారాయణ, నాయీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు దిమిలి పైడిరాజు, కార్యదర్శి శ్రీను, బిసి సంఘం నాయకులు పాల్గొన్నారు.

నేడు ఇపిఎఫ్ కార్యాలయ ముట్టడి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఈనెల 18న జిల్లా కేంద్రంలోని ఇపిఎఫ్ కార్యాలయం ముట్టడి జయప్రదం చేయాలని రిటైర్డు కార్మికులకు ఇపిఎస్ పింఛన్‌దార్ల సంఘం జిల్లా నాయకులు కిల్లంపల్లి రామారావు పిలుపునిచ్చారు. ఇపిఎఫ్ పింఛన్‌దార్లకు కనీస పింఛన్ 9వేలు ఇవ్వాలని కోరారు. ఓట్ల కోసం సామజిక పింఛన్లు పెంచుతున్న ప్రభుత్వాలకు ఇపిఎస్ పింఛన్ కనీస పింఛన్ పెంచే బాధ్యత లేదా అని ప్రశ్నించారు.

శేషగిరి ఆశయ సాధనకు కృషి

జయంతి కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

యుటిఎఫ్ నాయకులు కె.శేషగిరి జయంతి కార్యక్రమం సోమవారం జిల్లా పరిషత్ ఆవరణలోని యుటిఎఫ్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి యుటిఎఫ్ నాయకులు పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ శేషగిరి యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా పనిచేస్తూ సిపిఎస్ రద్దు కోసం, క్లస్టర్ పాఠశాలల రద్దు, ఎన్ఇపిలో ఉన్న లోపాలు..విద్యారంగానికి కలిగే నష్టాలపై అధ్యయనం చేసి ఐక్య ఉద్యమాలు నిర్మించారని తెలిపారు. భవిష్యత్‌లో చేపట్టే పోరాటాలు కార్యక్రమాలకు ఆ పోరాటాలు దిశా నిర్దేశం చేస్తాయని, తద్వారా శేషగిరి ఆశయాలను కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, జిల్లా కార్యదర్శులు కె.ప్రసాదరావు, సిహెచ్ తిరుపతినాయుడు, జి. రాజారావు, అల్లు శంకరరావు, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ పి.రాంప్రసాద్, జిల్లా అకడమిక్ కమిటీ కన్వీనర్ జి.గంగాధర్ విజయనగరం రూరల్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.రామకృష్ణ, జి.ఘనేశ్వరరావు, జామి మండల అధ్యక్షులు వి.వాసుదేవరావు, సంతకవిటి మండల అధ్యక్షులు ఎల్ బాబూరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు వి.సురేష్ బాబు, బివి గోపాల కృష్ణ, పి. వెంకటరావు, డి.సన్యాసిరావు పాల్గొన్నారు

నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు

తీర ప్రాంత పరిరక్షణకు సైకిల్ ర్యాలీ

ప్రజాశక్తి - భోగాపురం

తీర ప్రాంత పరిరక్షణకు ప్రజలను మమేకం చేసేందుకే సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు విశాఖ పోర్టు ట్రస్ట్ కమాండెంట్ సతీష్ కుమార్ తెలిపారు. కలకత్తా నుంచి కన్యాకుమారి వరకు చేపట్టిన ఈ ర్యాలీ సోమవారం భోగాపురం చేరుకుంది. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఈ సందర్భంగా ఘనంగా స్వాతం పలికారు. ఈ సందర్భంగా నితీష్ కుమార్ మాట్లాడుతూ 50 మందితో ఈ సైకిల్ ర్యాలీని చేపట్టామన్నారు. 6,553 కిలోమీటర్ల ప్రయాణించి ఈనెల మార్చి 31వ తేదీకి కన్యాకుమారికి చేరుకుంటామన్నారు. సంఘ విద్రోహ శక్తులకు తీరప్రాంత గ్రామాల నుంచి చొరబాటులు ఉండకూడదని ఈ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హెచ్ఎమ్ శ్రీనివాసరావు, స్థానిక నాయకులు పల్లంట్ల జగదీశ్, పల్ల రాంబాబు పాల్గొన్నారు.

సైకిల్ ర్యాలీకి స్వాగతం చెబుతున్న జెడ్‌పి హైస్కూలు విద్యార్థులు

'ఉపాధి' బిల్లుల చెల్లింపులో జాప్యం తగదు : ఎంపిపి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ఉపాధి హామీ ద్వారా చేపట్టిన పనులకు బిల్లులు చెల్లింపులో జాప్యం ఏర్పడుతుందని, ఇది అధికారుల నిర్లక్ష్యమా? ప్రభుత్వ అలక్ష్యమా? అని ఎంపిపి సండి సోమేశ్వరరావు ప్రశ్నించారు. సోమవారం పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతేడాది ఆగస్టు 23న ఉపాధి హామీలో గ్రామసభల ద్వారా వచ్చిన 744 పనుల్లో మొదటి విడతగా సెప్టెంబర్ 9న 163 పనులకు గాను రూ.12.78 కోట్లకు తీర్మానిస్తే అందులో కొన్ని పనులు మాత్రమే మంజూరయ్యాయని చెప్పారు. ఈ ఏడాది జనవరి 3న రెండో విడతలో 73 పనులకు తీర్మానించి, పంపిస్తే అవి మంజూరైనా, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉందని అధికారులు చెప్పడంతో ఆగాయని తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిశాక భువన యాప్‌లోకి మారాలని అధికారులు చెప్పారన్నారు. జనవరి 17న పుణ్యగిరిలో పనులకు తీర్మానం ఇవ్వగా, అవి భువన యాప్‌లోకి వచ్చాయని గుర్తుచేశారు. ముందు ఇచ్చిన పనులు ఎందుకు యాప్‌లోకి రాలేదని అధికారులను అడిగితే సరైన సమాధానం చెప్పలేదన్నారు. మూడో విడతలో 166 పనులకు ఆమోదించి పంపిస్తే, అవి కూడా యాప్‌లో చూపించడం లేదని, ఇలాంటి తరుణంలో నాలుగో తీర్మానం అధికారులు అడుగుతున్నారని అసహనం వ్యక్తంచేశారు. . ముందుగా తీర్మానించి పంపిన పనులను జిల్లా అధికారులు, మంత్రి కలుగచేసుకొని, పంచాయతీల అభివృద్ధికి సహకరించాలని కోరారు. లేకుంటే రెండు మూడు రోజుల్లో ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపిటిసిలు మజ్జి దేవి, వాకాడ సింహాచలం, బి.ఆదిలక్ష్మి, మోపాడ గౌరీశ్వరి, బొడల దేముడు, దార గిరి, కోఆప్షన్ ఎంపిటిసి బషీర్, ఎస్.కోట సర్పంచ్ గనివాడ సంతోషి కుమారి, బోజంకి గోవింద, కారుకొండ వెంకటరావు, మజ్జి గంగరాజు, శర్మ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ప్రజాశక్తి -పూసపాటిరేగ

ప్రజా చైతన్య యాత్రలో బాగంగా సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో దర్నా చేశారు. ఈ సందర్భంగా పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని తహశీల్దార్ తాడ్డి గోవిందకు ఇచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు బచ్చల సూర్య నారాయణ మాట్లాడుతూ అన్యాక్రాంతమైన దళితలు డి పట్టా భూములు, చెరువు గర్భాలు వంటి ప్రభుత్వ భూములు ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని, కొన్ని పంచాయతీల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలని, ఉపాధి కూలీలకు 7 వారాలు నుండి రావాల్సిన బకాయి బిల్లులు వెంటనే విడుదల చేయాలని, అర్హులైన వారందరికి ప్రభుత్వ పథకాలు అందించాలని డిమాండ్ చేశారు. మండలంలోని పరిశ్రమలు వల్ల వస్తున్న వ్యర్థాలు నివారణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. ముఖ్యంగా దళిత వాడల్లో విద్యుత్ బిల్లులు ట్రూఅప్ చార్జిలంటూ బారాలు మోపడం, విద్యుత్ కనెక్షన్‌లు తొలగించడం, ఉచిత విద్యుత్ అని చెప్పి వేలాది రూపాలయు కట్టాలని డిమాండ్ చేయడంపై వినతి అందించారు. మండల కేంద్రంలోని కెల్లవీధి, చాకలవీదిలో ఆనుకొని ఉన్న మురుగునీరు పూర్తిగా నివారించి పారిశధ్యం మెరుగుపరచాలన్నారు.

తహశీల్దార్‌కు వినతినిస్తున్న సిపిఎం నాయకులు సూర్యనారాయణ

రైతుల భూహక్కు సమస్యలపై ధర్నా

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

రైతుల భూ హక్కు సమస్యలు పరిష్కరించాలని సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.శంకర్రావు మాట్లాడుతూ ప్రజా చైతన్య యాత్రలో అన్ని గ్రామాల్లో పర్యటించామని తెలిపారు. రైతులకు సంబంధించిన భూ సర్వే నెంబర్లు తారుమారు జరిగాయని, మ్యుటేషన్ సమస్యలు పరిష్కారం కావడం లేదని, వారసత్వంగా పిల్లలకు రావల్సిన హక్కులు రాకుండా రెవెన్యూ అధికారులు అడ్డుకొంటున్నారని గుర్తించామని చెప్పారు. తండ్రి భూ హక్కును బిడ్డలకు మార్చాలని అర్జీ పెట్టినప్పటికీ మార్చడం కోసం లంచాలు అడుగుతున్నారని తెలిపారు. తప్పుడు సర్వే నెంబర్లు సరిచేయడానికి, మ్యుటేషన్‌కి, కొన్న భూమినీ తమ పేరిట చేర్చడానికి సిబ్బంది లంచాలు అడుగుతున్నారని తెలిపారు. రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ ఎం.శ్రీనుకు వినతిపత్రం అందజేశారు. తహశీల్దార్ స్పందించి రైతులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ ఎస్.గోపాల్, మండల కమిటీ సభ్యులు రెడ్డి త్రినాథ, ఎ.సురేష్, ఆర్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు సమస్యలు వివరిస్తున్న సిపిఎం నాయకులు

కేన్సర్ ఆస్పత్రి రహదారికి స్థల పరిశీలన

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని జీడీపాలెంలో శ్రీ సత్య సాయి ట్రస్ట్ లో ఏర్పాటు చేయనున్న కేన్సర్ ఆసుపత్రికి రహదారి కోసం భూములను సోమవారం కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పరిశీలించారు. జీడీపాలెంలో పర్యటించి. ఆర్‌డిఒ కీర్తి, ఎస్.కోట తహశీల్దార్ అరుణకుమారితో రహదారికి అవసరమగు భూములపై చర్చించారు. ప్రభుత్వ భూమిని ఎలియనేషన్, సత్య సాయి ట్రస్ట్ కు కేటాయించడం కోసం ప్రభుత్వానికి పంపడానికి ప్రతిపాదనలు వెంటనే తయారు చేయాలని ఆర్‌డిఒకు ఆదేశించారు.

ఉపాధి అవినీతిపై దృష్టి పెట్టండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- భోగాపురం

ఉపాధి హామీ పనుల్లో జరుగుతున్న అవినీతి పై దృష్టిపెట్టాలని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి అసెంబ్లీ సమావేశాల్లో సోమవారం కోరారు. ఎపిఒలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు కలిసి కూలీల హక్కులను దోచుకుంటు న్నారన్నారు. వీరు ముగ్గురూ కలిసి అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని చెప్పారు. వేతనాల్లో అక్రమాలు, నకిలీ హాజర్ల వంటి అవినీతిని అరికట్టాలని డిమాండ్ చేశారు. కూలీలకు వేతనాలు సకాలంలో అందేలా చూడాలని, సామాజిక ఆడిట్లు పారదర్శకంగా నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను కోరారు. అనంతరం పవన్ మాట్లాడుతూ ఉపాధి పనులు పారదర్శకంగా జరగాలని అవినీతిపై ఆరా తీస్తామని చెప్పారు.

సమన్వయంతో పని చేయాలి : డిపిఎం

ప్రజాశక్తి-లక్కవరపుకోట

ప్రకృతి వ్యవసాయ, మండల సమాఖ్య సిబ్బంది సమన్వయంతో పని చేయాలని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ ఎం.ఆనందరావు తెలిపారు. సోమవారం స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో విఒఎలు, ప్రకృతి సిబ్బందితో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం, తొమ్మిది సార్వత్రిక సూత్రాలపై అవగాహన కల్పించారు. ఎపిఎం ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఎస్‌హెచ్‌జి సభ్యులు ప్రకృతి వ్యవసాయంపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్రస్థాయి అధికారి కృష్ణప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

77 అంశాలకు స్టాండింగ్ కమిటీ ఆమోదం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగర మేయర్ విజయలక్ష్మి అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ సమావేశం సోమవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో జరిగింది. అజెండాలో పొందుపరిచిన 80 అంశాలను చర్చించిన అనంతరం మూడు అంశాలను వాయిదా వేయగా, మిగిలిన అంశాలకు సభ్యులు ఆమోదం తెలిపారు. అనంతరం మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ అందరి సహకారంతో నగరాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. ఆదాయ వనరులను పెంచుకొని నగర అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలు గూర్చి అందరి సమన్వయంతో ముందుకు సాగుతున్నామన్నారు. సిబ్బంది పనితీరులో మార్పు రావాలన్నారు. తాను చెప్పిన పని చేయడానికి ఇంజినీరింగ్ సిబ్బందికి మూడు నెలలు పట్టిందని, ప్రజల పనులు మీరేమి చేస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్ మాట్లాడుతూ వేసవిలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా అధికారులు పటిష్ట కార్యాచరణతో ముందుకు సాగాలన్నారు. దోమల నిరోధానికి లార్వా దశలోని నశింప జేసేందుకు అవసరమైన ఫాగింగ్ యంత్రాలు, స్ప్రేయింగ్ మరమ్మత్తులు చేపట్టాలని చెప్పారు. సమావేశంలో కమిషనర్ పల్లి నల్లనయ్య, సహాయ కమిషనర్ కె.అప్పలరాజు, స్టాండింగ్ కమిటీ సభ్యులు అల్లు చాణక్య, సుంకరి నారాయణ స్వామి, రేగాన రూపాదేవి, జివి రంగారావు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

క్రాష్ ప్రోగ్రామ్ ప్రారంభం

ప్రజాశక్తి- రాజాం

సమ్మర్ క్రాస్ ప్రోగ్రామ్‌ను స్థానిక మండల పరిషత్తు కార్యాలయం వద్ద సోమవారం ఎంపిడిఒ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జెడ్‌పిటిసి బండి నరసింహులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాడైపోయిన బోర్లను బాగు చేసి తాగునీటిని అందిస్తామని చెప్పారు. ఈ ప్రత్యేక వాహనంలో బోరు మరమ్మత్తులుకు అవసరమైన మెటీరియల్ సిబ్బంది ఉంటారని, వెనువెంటనే అక్కడ మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకువస్తారని తెలిపారు. మండలంలో సుమారు 398 బోరు బావులను పూర్త స్థాయిలో బాగు చేసి వినియోగంలోకి తీసుకు వస్తారన్నారు. కార్యక్రమంలో అధికారులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన కుటుంబాన్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని కొండగంగుపూడి పంచాయతీ ఎస్‌టి కాలనీలో ఇటీవల సంభవించిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన దుంబరి బుచ్చమ్మ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం జిల్లా నాయకులు చల్లా జగన్ కోరారు. బుచ్చమ్మ భర్త మరణించాడని, ఇద్దరు ఆడపిల్లలతో జీవనం సాగిస్తున్న ఆ నిరుపేద ఇల్లు శనివారం దగ్ధమైందని తెలిపారు. ఆ కుటుంబాన్ని అధికారులు, ప్రభుత్వం ఆదుకోవాలని, ఇల్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

వినతులు స్వీకరించిన ఎస్‌పి

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాపోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎస్‌పి వకుల్ జిందాల్ పలువురు నుంచి వినతులు స్వీకరించారు. ఈ వారం మొతంగా 32 వినతులు వచ్చాయి. సమస్యలు విన్న ఎస్‌పి పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడి చట్ట పరిధిలో వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫిర్యాదుదారుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని, ఫిర్యాదుల పరిష్కారానికి చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి పి.సౌమ్యలత, ఎస్‌బి సిఐలు ఎ.వి.లీలారావు, ఆర్‌విఆర్‌కె చౌదరి, డిసిఆర్‌బి ఎస్ఐ రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల సమస్యపై నేడు ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో నివాసం ఉన్న చోట జీఓ నెంబర్ 30 ప్రకారం రెగ్యులర్ చెయ్యాలని, ఇళ్ల లేని పేదలకు 2 సెంట్లు భూమి ఇచ్చి 5 లక్షలు మంజూరు చెయ్యాలని, టిడ్కో ఇళ్లు అప్పగించాలని కోరుతూ ఈనెల 18న చలో తహశీల్దార్ కార్యాలయ నిర్వహించనున్నట్లు సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకర్రావు తెలిపారు. ప్రజా చైతన్య యాత్ర సందర్భంగా సోమవారం వినాయక నగర్ ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం పట్టణాల్లో పేదలకు 2 సెంట్లు భూమి ఇస్తామని చెప్పిందని, వెంటనే దాన్ని అమలు చేయాలని కోరారు. పోరాటంలో ప్రజలు భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.రమణమ్మ, బి.రమణ తదితరులు పాల్గొన్నారు .

పట్టణంలో కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలోని పలు ప్రాంతాల్లో సోమవారం మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి పర్యటించారు. ఆర్‌టిసి కాంప్లెక్సు, రాజా కళాశాల రోడ్డు, అన్న క్యాంటీన్ ప్రాంతాల్లో పర్యటించారు. అన్న క్యాంటీన్‌లో అల్పాహారం పరిశీలించి, రుచి, నాణ్యత ఎలా ఉందో అక్కడున్న వారిని అడిగి తెలుసుకున్నారు. ఆర్‌టిసి కాంప్లెక్సును పరిశీలించి, డిపో మేనేజర్‌తో మాట్లాడారు. ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి వచ్చే అవుట్‌లెట్లను త్వరితగతిన క్లియర్ చేయాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. రాజా కాలేజీ ఏరియాలో రోడ్లపై చెత్తలు వేయకుండా చూడాలని చెప్పారు.

నేరాలు ఘోరాలు

స్కూటీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని 26వ జాతీయ రహదారి జొన్నాడ వద్ద స్కూటీ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జొన్నాడ పంచాయతీ దువ్వుపేట గ్రామానికి చెందిన నక్కిన రాము (72) తన గ్రామం నుంచి జొన్నాడ జంక్షన్ వద్దకు టీ తాగేందుకు వచ్చి తిరిగి తమ గ్రామం దువ్వుపేట నడుచుకుంటూ వెళుతుండగా విజయనగరం నుంచి విశాఖపట్నం వైపు వెళుతున్న స్కూటీ వెనక నుంచి రామును ఢీకొని దీంతో తలకు బలమైన గాయాలు కావడంతో వెంటనే స్థానికులు జిల్లా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్థారించారు. ఎస్ఐ ఏ సన్యాసినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాముకాటుతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-గంట్యాడ

మడలంలోని బురదపాడు గ్రామానికి చెందిన చుక్క రాంబాబు (39) పాము కాటుతో మృతి చెందాడు. ఈనెల 9న పొలంలో పనిచేస్తుండగా పాము కాటు వేయడంతో వెంటనే జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో విశాఖ కెజిహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం ఆయన మృతి చెందాడు. రాంబాబుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.